

# భూతద్దాలు

# భూతద్దాలు

మీద బెర్తు మీద హోల్డాలు పరచి నడ్డి వాల్చేరు మిడతంభొట్లు మేష్టారు. విశాఖపట్నం స్టేషన్‌లోనే బండెక్కడంలో ఒక సుఖం ఉంది. బండి ఖాళీగా ఉంటుంది. పడుక్కుందుకి చోటు దొరుకుతుంది. ఈ బోగీని వాల్తేరులో మెడ్రాసు పోయే బోగీకి తగిలిస్తారు. ఇదంతా గంటన్నర తతంగం. చిన్న కునుకు లాగించడానికి ఇదే మంచి తరుణం. బండి కదిలేసరికి జోకొట్టినట్లు నిద్ర పట్టేస్తుంది. అలాగని తనివి తీరా నిద్ర పోడానికీ వీలు లేదు. కలత నిద్ర, కలల నిద్రతో సామాన్ల మీద ఒక కన్నూ, వచ్చే పోయే స్టేషన్ల మీద మరొక కన్ను వేసి అడపా, తడపా రసగంధాయంలో పడే సంభాషణల మీద ఒహ చెవిని పారేసి కునుకు లాగించడం అంటే మజాకా ఏమీ కాదు.

రైలు ప్రయాణంలో ఎంత సర్వసంగపరిత్యాగిలా ముక్కు మూసుకు కూర్చుందామనుకున్నా కుదరదు. తారస పడ్డ కొందరు మనస్సులో పీఠం వేసుకుని కూర్చుంటారు. అప్పుడే కింద సీటులో కూర్చున్న తల్లీ, కూతురూ ఈ కోవకి చెందిన వారే.

బండి కదుల్తోంది. మేష్టారు మగత నిద్రలో పడుతూ, లేస్తూ, అడపా, తడపా, కింద సీట్లలో సందడి చూస్తూ మీద బెర్తు మీద దొర్లుతునారు. కిటికీ పక్క సీట్లో ఉన్న బాలిక అమెరికా నుండి చుట్టపు చూపుకి వచ్చిందిట. ఏవేవో విడ్డూరాలు చూపిస్తోంది. చుట్టూ అమ్మలక్కలు చేరి విడ్డూరాన్ని చూస్తున్నారు. "శాంత మూర్తివని భ్రాంతి చెందితిని, కోపమేల శ్రీరామా" అని పాట పాడుతూ, "అమ్మా, కళ్లు లేని కబోదిని, బాబూ" అని ముష్టెత్తుకుంటూన్న అమ్మి కూడా వింతని చూడ్డానికి ముందుకి వచ్చింది.

అమ్మాయి చూపించిన వాటిల్లో అందరినీ ఎక్కువ ఆకర్షించింది 'ఫొటో అద్దం.' వింతని అంతా ఎగబడి చూస్తున్నారు.

"ఇంద్రజాలం" అన్నారు ఒకరు, "కనికట్టు" అన్నారు మరొకరు.

"తీర్థం కాడ సుసినాను కాదటేస్. సాతానోడు అయిదు పైసలు టిక్కెట్టెట్టి సుపించినాడమ్మగోరూ. ఆడు 'సూడే బోగం పిల్లని సూడే' అని పాట కూడ పాడిండు" అని గుడ్డిపిల్ల వంత పాడింది.

ఇంత హడావుడి జరుగుతూన్నా అంటీ అంటనట్లు చూస్తూ, కునుకుతూ ఉన్న మానవుడిని పడుక్కోనియ్యకుండా, "మేష్టారూ, మీరే చెప్పండి ఇందులో మంత్రమే ఉందో యంత్రమే ఉందో" అని ఒక ఆసామీ తగులుకున్నాడు.

కళ్లు నులుపుకొని, ఆసామీ అందించిన ఆటవస్తువుని చూసి, నిర్ఘాంత పోయి, "ఈ భూతద్దాలు అప్పుడే బజారులోకి అమ్మకానికి వచ్చేయా?" అంటూ లేచి కూర్చోబోయేరు. బుర్ర వెళ్లి సామాన్లు పెట్టుకునే ఉక్కు చట్రానికి తగిలి, కళ్లు తిరిగి బుర్ర దిమ్మెక్కి పోయింది.

మిడతంభొట్లు మేష్టారి అసలు పేరు చాలమందికి తెలియదు. అయన్ని తెలుసున్న వాళ్లు 'మేష్టారూ' అనే పిలిచేవారు. తెలియని వాళ్లందరినీ మనం 'మేష్టారూ' అనే పలకరిస్తాం కదా. అందుకని మిడతంభొట్లు తనని పేరు పెట్టి పిలవలేదని చింతించే వారు కాదు. ఇలా చింతిస్తూ టైము వేస్టు చెయ్యడానికి ఆయనకి తీరుబడే ఉండేది కాదు. ఎప్పుడూ, ఏదో ఆలోచిస్తూ ఉండేవారు.

ఆవేళ కూడ భిమిలిపట్నం బీచిలో కూర్చుని చాల సేపు ఏదో ఆలోచిస్తూ కాలం గడిపేరు. దూరాన్న డాల్ఫిన్స్‌నోస్ మీద దీపస్తంబం అడిగిన వారికి, అడగని వారికి దారి చూపిస్తోంది. 'ఆ స్తంబం మీద మామూలు దీపానికి బదులు లేసరు దీపం పెడితే అప్పుడు రోదసిలో తిరిగే నభో నౌకలకి కూడ దారి చూపెడుతుందేమో' అని స్వగతంగా అనుకుని నవ్వుకున్నారు.

సంధ్యాసమయం దాటిపోయింది. చిరు చీకటి కమ్ముకొస్తోంది. ఆకాశాన్ని వృష్టిక మేఘాలు నెమ్మదిగా ఆవరిస్తున్నాయి. మేష్టారు లేచి బయలుదేరేరు. చిన్న తుంపర మొదలయింది. చంకలో ఉన్న గొడుగుని విప్పి అడుగులు కొంచెం జోరుగా వెయ్యడం మొదలు పెట్టేరు.

''నాయనా, గొడుగులో కొంచెం చోటు ఇస్తావా?'' ఒక కంఠం సమీపించింది.

అప్పుడే మెరసిన మెరుపులో ఆగంతకుని చూసేరు మిడతంభొట్లు. కాషాయ వస్త్రాలు శరీరాన్నీ, గుబురుగా పెరిగిన గెడ్డం ముఖ కళవళికలనీ మరుగు పరచినా, ముసలాయన కళ్లల్లోని మెరుపు నభోవీధి లోని విద్యుల్లతకు లేశమాత్రం తీసిపోలేదు.

''ఆశ్రమానికి వెళుతూన్నట్లున్నారు. అకాశం చూస్తే ఇంకా బాగా వర్షం పడేటట్లే కనిపిస్తోంది. మీరు దారి చూపితే గొడుగులో నేను దిగ బెడతాను'' అన్నారు మిడతంభొట్లు, పరివ్రాజకులకి చూపవలసిన మర్యాద చూపుతూ.

ఇరువురూ నడుస్తూ ఉండగా నేపధ్యంలోని నిశ్శబ్దంలోకి సముద్రపు హోరు లీనమైపోతూ ఉంటే అడుగుల సవ్వడి మాత్రం ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నాది.

అలా కొంత దూరం నడచి ఒక మర్రి చెట్టు దగ్గర ఆగేరు. ఆ చీకట్లో జుట్టు విరగబోసుకున్న దయ్యంలా కనిపించిందా చెట్టు. గుబురుగా పెరిగిన ఆ చెట్టు వెనక అవరణలో ఒక పర్ణశాలని పోలిన పాక, దాని కెదురుగా చిన్న పెంకుటిల్లు లీలగా కనిపించేయి. స్వాములవారు గేటు తెరచుకుని లోపలికి దారి తీసేరు.

పెంకుటింటి లోపల విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. ఇంటికి గాజద్దాల కిటికీలు ఉండడం వల్ల, బయట చిట్ట చీకటిగా ఉండడం వల్ల ఇంటి లోపలి భాగం బయటకు కనిపిస్తోంది. లోపల అధునాతనంగా అమర్చబడ్డ సోఫాలు. గోడల మీద తైలవర్ణ చిత్రాలు. సోఫా కెదురుగా నేల మీద టెలివిషన్ సెట్టులో ఏదో పంచరంగుల కార్యక్రమం వస్తోంది. ఇంత అధునాతనంగా ఉన్న ఇంటిని మిడతంభొట్లు మన దేశంలో ఎప్పుడూ చూడ లేదు. ఇంతలో

కళ్లు మిరుమిట్లు గొలిపేలా పెద్ద మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో చూస్తే ఆ ఇల్లు సాదా పెంకుటిల్లే. కళ్లు మళ్లా చీకటికి అలవాటు పడే సరికి కొంత సేపు పట్టింది. యాంత్రికంగా అడుగులు మాత్రం పడుతున్నాయి.

పెంకుటింట్లో ఎవరో మసలుతూన్నట్లు కనిపించింది. ఇంతలోనే పాశ్చాత్య వనిత ఒకామె కిటికీ దగ్గరకి వచ్చింది. కాని ఆమె ఆగంతకుల రాకని గమనించినట్లే లేదు. ఆమె చూపులు ఈ కాలపు చూపులలా లేనే లేవు. మరో లోకంలో ఎక్కడో ఉన్నట్టు అనిపించింది. మిడతంభొట్లు ఒళ్లు ఒక్క సారి జలదరించింది.

స్వాములవారు పర్ణశాల వైపు తిరిగారు. సభ్యత, సంస్కారం ఎంతలా కళ్లెం వేస్తూ ఉన్నా, విదేశస్థుల మీద సహజంగా ఉండే కుతూహలాన్ని అదుపులో పెట్టుకో లేక మిడతంభొట్లు పదే పదే వెనక్కి తిరిగి చూడకుండా ఉండలేక పోయారు.

వేషభాషలు చూస్తే పరివ్రాజకుడా? గూటిలో చూస్తే రామ చిలుకా? షష్ఠిపూర్తి దగ్గర పడుతూన్న ఈ వ్యక్తికి నడి వయస్సులో ఉన్న ఆమెతో సాంగత్యం ఏమిటి? ఛ! ఛ! ఇంత చదువూ చదివి సంగతి తెలుసుకోకుండా ఈ అభియోగాలు, ఈ అనుమానాలు ఏమిటి? కొంపతీసి ఈ స్వామి పాతాళభైరవి సినిమాలో చూసిన నేపాళ మాంత్రికుడు లాంటి మంత్రగాడు కాదు కదా? ....

''ఇదే నేను నివసించే 'స్వర్గసీమ'. ఈ పర్ణశాలే నా ప్రయోగశాల. లోపలికి దయచెయ్యండి'' అన్న మాటలతో మేష్టారు మళ్లా మన లోకంలోకి వచ్చేరు.

గొడుగులో చోటు కావాలని అడిగిన తర్వాత మళ్లా ముసలాయన మాట్లాడడం అదే. మితభాషి కాబోలు. తనమీద ఏం ప్రయోగాలు చేస్తాడో అన్న అనుమానంతో బెదురు బెదురుగానే మిడతంభొట్లు లోపల అడుగు పెట్టేరు. పైకి పర్ణశాలలా కనిపించినా లోపల అది ఒక ప్రయోగశాల. నాలుగు పక్కలా పరకాయించి చూస్తూ ఉండగా 'ప్రొఫెసర్ నిత్యానందం' అన్న పేరు చెక్కబడ్డ ఫలకం ఒకటి లోపల తలుపు మీద వేలాడుతూ కనబడింది. లోపల ఆర్భాటం అట్టే లేక పోయినా, ఉన్న స్థలం మేరకి బల్లలు, వాటి మీద ఎంతో చాకచక్యంతో అమర్చబడ్డ శాస్త్రీయ పరికరాలు కనిపించేయి. గది మధ్యలో మాత్రం పెద్ద పొడుగాటి బల్ల ఒకటి ఉంది. ఇరవై అడుగుల పొడుగు, ఐదు అడుగుల వెడల్పు ఉంటుందేమో. దాని మీద లేసర్ కాంతిని ఉత్పాదించే పరికరాలు అమర్చబడి ఉన్నాయి. పక్క గదిలో చిన్న కొలిమి ఉంది. అది గాజు కరిగించడానికి ప్రయోగశాలలో వాడే రకం అని మేష్టారు వెంటనే పసి కట్టేరు.

బెదురు, భయంతో లోపలికి అడుగు పెట్టిన మిడతంభొట్లు ఆశ్చర్యంతో కళ్లప్పగించి, ''ఇది ఏదో విశ్వవిద్యాలయంలోనో ఉండ తగ్గ ప్రయోగశాలలా ఉంది కాని ...''

''నిజమేనోయ్. వీటన్నిటిని అమెరికాలో సంపాదించి పట్టుకొచ్చేను. మన ఆంధ్రా యూనివర్శిటీలో నెలకొల్పుదాం అని ప్రయత్నించేను. కాని సిరిరా మోకాలడ్డు వారెవరేనా ఉన్నారా అంటే మనవాళ్లేనోయ్. అదంతా పెద్ద గాథలే. ఇప్పుడెందుకు కానీ....''

వాక్యం మధ్యలో ఆపేసి గది కావలి చివర వరకూ ఏదో ఆలోచించుకుంటూ వెళ్లిపోయారు నిత్యానందం.

''పంచరంగుల టెలివిషన్!!'' – ఈ ఆలోచన మితడంభొట్లు మస్తిష్కంలో మళ్లా మెరిసింది. ఒళ్లంతా జెర్రులు పాకినట్లయింది. మనస్సుని అదుపులో పెట్టుకో లేక కంటి కొన నుండి పెంకుటింటి వేపు మరొక సారి చూసేరు. ఇది కల కాదు. నిజమే. లేదా పంచరంగుల కల అయుండాలి.

ఇలా పగటి కలలు కంటూన్న మిడతంభొట్లు ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ, ''ఇది పదేళ్ల పలక'' అంటూ నిత్యానందం చేత్తో ఒక గాజు పలకని పట్టుకుని వెనక్కి తిరిగొచ్చారు. ''ఇలాంటిది ఎప్పుడేనా చూశావా?''

నిత్యానందం మాటలలోని అంతరార్థం అర్థం కాక, యాంత్రికంగా ఆ నల్లని గాజు పలకని అందుకుంటూ, ఆశ్చర్యార్థకంలా ఉన్న ముఖాన్ని ప్రశ్నార్థకంలా మార్చేసేరు మిడతంభొట్లు మేష్టారు.

''అంటే ఈ గాజు పలక మందం పదేళ్లన్న మాట.'' పిల్లి అంటే అర్థం కాని వాడికి మార్జాలం అంటే అర్థం అవుతుందా? మిడతంభొట్లు అవస్థ అర్థం అయినట్లుంది నిత్యానందం గారికి.

''..ప్చ్...ప్చ్ ఒక వస్తువు పొడుగు కాని, వెడల్పు కాని ఎలా కొలుస్తాం? ఇన్ని అంగుళాలనో, అడుగులనో కొలుస్తాం. పెద్ద పెద్ద దూరాలు కొలవాలంటే కిలో మీటర్లని వాడతాం. ఇంకా ఎక్కువ దూరం కొలవాలంటే జ్యోతిర్వర్షాలు వాడతాం. అవునా?

''జ్యోతిర్వర్షం అన్నా కాంతి సంవత్సరం అన్నా ఒకటే. పది సంవత్సరాల కాలంలో కాంతి దరిదాపు నూరు ట్రిలియను కిలోమీటర్లు దూరం వెళుతుంది. అవునా? ఇప్పుడు ఈ గాజు పలకకి ఇటు పక్కన ఒక కొవ్వత్తి వెలిగించి పెడితే ఆ వెలుగు రెండో పక్కకి చేరుకునే సరికి పదేళ్లు పడుతుంది.''

ఇంత కంటె జోరుగా చెపితే మిడతంభొట్లు మేష్టారికే కాదు, ఎవ్వరికి అర్థం అవదని నిత్యానందానికి తెలుసు.

''మీరనేది పదేళ్లు పోతే కాని ఆ కొవ్వత్తి ఈ రెండో పక్క నుండి కనిపించదంటారు?''

''అవునోయ్. అందువల్లనే ఈ పలక కారు నలుపుగా మసి పూసినట్లు ఉంది. నాకు సాయంగా, ఈ చీకటిలో వచ్చినందుకు ఈ పలకని నీకు బహుమతిగా ఇస్తున్నాను. తీసుకో.''

''స్వామీ. ఇటువంటి వస్తువుని నేనెప్పుడూ కనీ, వినీ ఎరగను. దీని ఉపయోగం ఏమిటి? దీనిని ఎలా తయారు చేసేరు? అసలు తమరు ఎవరు? ఇవేమీ తెలుసుకోకుండా ఈ పదేళ్ల పలకని పట్టికెళ్లి ఏమి ప్రయోజనం?''

''చిరంజీవీ! చూడు. ప్రకృతి సిద్ధమయిన సత్యాన్ని కనుక్కోవడంతో శాస్త్రజ్ఞుడి బాధ్యత తీరిపోదు. మానవుడి ఊహా శక్తి అంచు లేని అఖాతం లాంటిది. ఈ గాజు పలకే ఉంది. ఈ గాజు పలకలోనికి వెళ్లిన వెలుగు పదేళ్ల తర్వాత కాని బయటకు రాదు. ఇలాగే, పన్నెండు గంటల పలకని చెయ్య వచ్చు. ఆ పలకని కిటికీకి అమర్చితే గదిలో రాత్రి పగలవుతుంది. అప్పుడు ఈ విద్యుద్దీపాలే అక్కర లేదు.''

మంత్ర ముగ్ధుడిలా మిడతంభొట్లు వింటున్నాడు.

''ఇదే సూత్రం ఉపయోగించి గాజద్దాలు తాపడం చేసిన ఇంటిలో ఋతువులు, కాలాలు మార్చవచ్చు. గోడల మీద వేలాడే చిత్రాలకి చలనం కలిగించి జీవం పొయ్య వచ్చు. గతంలో జరిగిన సంఘటనలని ఈ ఫలకంలో బంధించి తర్వాత తెర మీద బొమ్మలలా, టెలివిషన్ చిత్రాలులా చూడవచ్చు. ఇలా భూత కాలం లోకి చూడనిచ్చే అద్దం కనుక దీనికి 'భూతద్దం' అని పేరు పెట్టేను.

''చూడడానికి అరంగుళం కంటె ఎక్కువ మందంగా లేదు కదా, కాంతి ఇటు నుండి అటు ప్రయాణం చెయ్యడానికి అంతంత కాలం ఎలా పడుతుందో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా నాకు బోధ పడడం లేదు.''

''సూది మోపినంత మేరలో ఇమిడేటట్లు ట్రాన్సిస్టర్లు తయారు చెయ్యడం లేదుటోయ్. అలాగే అతి సూక్ష్మమైన లేసర్లు కూడ చెయ్య వచ్చోయ్. అలాగే అతి సూక్ష్మమైన అద్దాలు తయారు చెయ్య వచ్చు. నేనేమి చేసేనంటే గాజుని పల్చటి పొరలు పొరలుగా చేసేను – పూతరేకుల మాదిరి. పూతరేకులలో మధ్యని నెయ్యి, పంచదార వేసి ఒత్తమూ? అలాగే, ఈ గాజు పొరలకి ఒక వైపు గేలియం అల్లూమినం ఆర్సెనైడు, రెండవ వైపు ఉత్త గేలియం ఆర్సెనైడు లేపనంలా రాసి, ఆ రెండు పొరలనీ ఒకదానికొకటి అతుక్కునేలా చేసేను. ఇదంతా నేను చెబుతూన్నంత తేలిక కాదని నువ్వు గ్రహించే ఉంటావు. పదేళ్లు అహర్నిశలూ తాపత్రయం పడి సాధించేను. అప్పుడు ఈ గాజు పొరల మధ్య ఉన్న ప్రతి రేణువు ఒక బుల్లి లేసరులా పని చేస్తుంది. ఇలాంటి లేసర్లు కోటాను కోట్లు మన గాజు పొరల మధ్య ఉన్నాయన్న మాటే కదా.''

ఊపిరి పీల్చుకునేందుకు ఆగి, మిడతంభొట్లు ముఖ కళవళికలని ఒకసారి పరీక్షించి, మళ్లా అందుకున్నారు.

''కొంచెం ఊహ ఉపయోగించి ఈ లేసర్లు అన్నిటిని ఒక అనుకూలమైన వరుసలో అమర్చ వచ్చు. ఇలా అమర్చబడ్డ లేసరు పేరు (కాసుల పేరులా) లోపలికి ఒక కొస నుండి కాంతి వాకేతాన్ని పంపిస్తాం. ఈ వాకేతం మన లేసరు పేరులో ప్రవేశించి, దానికి ముందు,

వెనక ఉన్న అద్దాల వల్ల - బంతులాటలో బంతిలా - ఇటు అటూ కొట్టుకుంటూ ఉంటుంది. ఈ రకం ఉపకరణానికి 'లేసర్ డిలే లైన్' అని పేరు పెట్టేను. దీన్ని తెలుగులో లేసరు కాలహరణి అనొచ్చు. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ లేసరు పేరులోకి ప్రవేశించిన కాంతి కిరణం ఒకంతట బయటకి పోదు. మనం ఎప్పుడు బయటకు పొమ్మంటే అప్పుడే పోతుంది.''

ఇలా భూతద్దాల కట్టడి, లక్షణాలు, ఉపయోగాలు ఆయన నల్లబల్ల మీద బొమ్మలు గీసి చెబుతూ ఉంటే మిడతంభొట్లు ఆశ్చర్యంతో కళ్లప్పగించి విన్నారు. మరీ ఎక్కువ సేపు ఉంటే మర్యాదగా ఉండదని మేష్టారు స్వామి దగ్గర సెలవు తీసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

''ఉండవోయ్. ఇక్కడే ఉండు. కాస్త ఫలహారం పట్టుకొస్తాను'' అని పర్ణశాల వదలి ఎదురుగా ఉన్న ఇంటిలోకి వెళ్లేరు.

మిడతంభొట్లు ఆలోచిస్తూ అక్కడే నిలబడి ఉన్నారు. ఆయన ఆలోచనలు పరి పరి విధాల పోతున్నాయి. అయితే ఆ కిటికీలోంచి కనిపిస్తూన్న వనిత ఈయన భార్యా? కనీసం లోపలికి రమ్మనమని, పరిచయం చేస్తానని అనలేదే. లోపలికి వెళ్లిన మనిషి టెలివిషన్ ఉన్న గదిలోకి వెళ్లినట్లు లేదు. వెళ్లి ఉంటే కిటికీలోంచి కనిపించి ఉండే వాడు.

ఇలా ఆలోచనా తరంగాలలో కొట్టు మిట్టాడుతూ ఉండగా రివ్వున గాలి వీచింది. ఆ గాలికి ఆ పెంకుటింటి పంచలో ఉన్న లేడి చర్మం ఎగిరి వాకట్లో పడి తడిసి పోతోంది. కనీసపు మర్యాదగా మిడతంభొట్లు పరగున వెళ్లి ఆ జింక చర్మాన్ని అందుకుని, అదే పరుగులో పెంకుటింటి పంచకి చేరే సరికి ఆ గాలికే టెలివిషన్ ఉన్న గది తలుపు భడాల్న తెరుచుకుంది. కుతూహలంతో కుతకుత లాడుతూన్న మిడతంభొట్లు సభ్యత విడచి ఆ గది లోపలికి తొంగి చూడకుండా ఉండ లేక పోయాడు.

చిట్ట చీకటిగా ఉన్న గదిని చూసే సరికి మిడతంభొట్లు గొంతుక ఎండి పోయింది! అప్పుడే దయ్యాన్ని చూసిన వాడిలా ముఖం పాలిపోయింది. కాళ్లు ఒణకడం మొదలు పెట్టేయి. నిర్మానుష్యంగా, చిందర వందరగా ఉన్న ఆ గదిలో అమ్మాయి లేదు, టెలివిషనూ లేదు. ఆ చీకటిలో పండ్ల రసం పట్టుకొస్తూన్న నిత్యానందం విగ్రహం మాత్రం లీలగా కనిపించింది.

''క్షమించండి. మీరు వారించినా వినకుండా ఇటొచ్చాను'' అంటూ ఆయన అందించిన రసంతో గొంతుక తడుపుకున్నాడు మిడతంభొట్లు.

''ఇలా వచ్చి ఇక్కడ కూర్చోండి. నేను వారించినా నా మాట వినకుండా ఇటొచ్చేరు. అసలు సంగతి ఇంక చెప్పక తప్పదు.

''అవి నేను బోస్టన్‌లో ఉన్న రోజులు. నేను ఎమ్. ఐ. టి. లో అసోసియేట్ ప్రొఫెసర్ గా ఉన్న రోజులలో నా ప్రయోగశాలలో పని చేసే విద్యార్థినిగా ఉండేది సూజన్. మా అభిరుచులతో పాటు మనసులు కూడ కలిసేయి. స్వర్గలోకపు అంచులలోనే విహరించేం. ఒక

రోజు హోమీ భాభా గారు వచ్చి భారత దేశం భవిష్యత్తు నాలాంటి వారి మీదే ఆధార పడి ఉందనీ, బొంబాయి రమ్మనీ బలవంతం చేసేరు. కాదన లేక పోయాను.

''పసి పిల్లలా ఎగిరి గంతేసింది, సూజన్. నాతో ఎక్కడికయినా వస్తానంది. ప్రయాణ సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయ్. ఆ హడావిడిలో కారు నడుపుతూ ప్రమాదానికి గురి అయి....''

నిత్యానందం గారి గొంతుక డగ్గుత్తికతో కంపించింది.

''మమకారం చంపుకో లేక పోయిన మనిషిని కాని, ఈ దండం, కమండలం అండగా చేసుకుని సంఘంతో దోబూచులాడే దొంగ సన్యాసిని మాత్రం కాను. నా సూజన్‌ని ఒదిలి పెట్టలేక నాతో తెచ్చుకున్నాను. మరొకరికి మనస్సివ్వ లేక ఈ వేషం ధరించేను. బోస్టన్‌లో ఉండలేక, బొంబాయి వెళ్లలేక ఇక్కడికొచ్చేను.''

''ఇప్పటికే చాల ఆలస్యం అయిపోయింది. మరొకసారి కలుసుకుందాం'' అని నిత్యానందం గారి దగ్గర సెలవు తీసుకుని ఇంటి ముఖం పట్టేరు మిడతంభొట్లు.

కాగితంలో చుట్టబెట్టిన భూతద్దాన్ని చంకలో పెట్టుకుని, గొడుగు విప్పి, వడివడిగా అడుగులు వేయ సాగేరు. గేటు దాటి, మర్రి చెట్టు దగ్గర మలుపు తిరిగి పదడుగులు వేసేరో లేదో మిరుమిట్లు గొల్పుతూ ఆకాశం పెద్దగా మెరిసింది. పక్కనే ఎక్కడో పిడుగు పడ్డట్టుంది, వెనువెంటనే చెవులు దద్దరిల్లేలా శబ్దం వినిపించింది. వాతావరణంలో ఉన్న స్థిర విద్యుదావేశానికో ఏమో మేష్టారి శరీరం మీద రోమాలు నిక్కబొడుచుకుని నిలబడ్డాయి. తడి నేలమీద పట్టు తప్పి కాలు జారి నేలమీద వెల్లకిల్లా పడ్డారు మేష్టారు. అగ్నికి ఆహుతి అవుతూన్న పర్ణశాల కనిపించింది కాని కదిలి లేవ గలిగే పరిస్థితిలో లేరు ఆయన.

మత్తు వదలి బరువయిన రెప్పలు విప్పేసరికి కంటికి ఎదురుగా ఇటూ అటూ ఊగుతూ ఒక చిన్న దీపం, ఆ దీపాన్ని పట్టుకుని తెల్లటి వస్త్రాలతో ఒక వైద్యుడు కనిపించేరు మిడతంభొట్లు మేష్టారికి.

''భూతద్దం, నా భూతద్దం'' అంటూ లేవబోయారు.

''వెధవ భూతద్దాలు. కో అంటే కోటి దొరుకుతాయి. విరిగి పోయిన గాజు పెంకు కోసం అలా గాభరా పడకు.'' అని డాక్టర్ మందలించేరు.

''రాధా, నువ్వేనా అర్థం చేసుకోవా?'' డాక్టర్ వెనకాతల నిలబడ్డ రాధతో మొర పెట్టుకున్నారు.

మేష్టారు ఆసుపత్రి నుండి విడుదల అయి ఇంటికి వచ్చిన తర్వాత, నెమ్మది నెమ్మదిగా పాత విషయాలు స్ఫురణకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేసేరు. నిత్యానందం గారి ఉపాఖ్యానం అంతా ఒక కల అనీ, బండి వాల్తేరు వదిలే లోపుగా కల కనడమూ, కల చెదరి, నెత్తికి దెబ్బ తగలడమూ, బండిలోంచి దింపి ఆసుపత్రికి చేర్చడమూ జరిగేయని డాక్టరు లేవదీసిన సిద్ధాంతం.

భూతద్దాలు తను కన్న పగటి కల అని డాక్టరు అనేసరికి మిడతంభొట్లుకి ఆ మాటలు నమ్మాలని అనిపించలేదు. పని గట్టుకుని భీమిలిపట్నం బీచికి వెళ్లేరు. తను ఎప్పుడూ కూర్చునే స్థలంలో కూర్చుని చూసేరు. అక్కడ నుండి దీపస్తంబం కనిపించ లేదు కానీ, గిర్రున తిరిగే దీపపు చార కనిపిస్తోంది. అక్కడ నుండి ఆశ్రమానికి దారి తీసేరు. చీకట్లో స్వామి దారి తీస్తూ ఉంటే ఆయనని అనుసరించి వెళ్లడం అంటే తేలికే కాని తను ఒక్కడూ ఆ ఆశ్రమాన్ని కనుక్కో లేక పోయాడు. ఒక మర్రి చెట్టు మాత్రం కనిపించింది. ఆ చెట్టు ప్రాంతాలలో పగిలిన గాజు పెంకులు కనిపించేయి. ఆ చెట్టు పక్కని కాలి పోయిన సారా పాక కనిపించింది. పాకకి ఎదురుగా పడిపోయిన పెంకుటిల్లు ఒకటి ఉంది. కాని ఎవర్ని అడిగినా అక్కడ స్వాముల వారిని చూసినట్లు ఎవ్వరూ ఇదమిద్ధంగా చెప్ప లేక పోయారు.

(ఆంధ్రసచిత్ర వారపత్రిక 20 ఆగష్టు 1971 సంచికలో ప్రచురించబడ్డ కథ ఇది. అక్కడక్కడ చిన్న చిన్న తప్పులు సవరించడం జరిగింది తప్ప కథలో మార్పు ఏమీ లేదు.)